بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ　نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ　وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡد

Summary of Friday Sermon Hazrat Khalifatul Masih V, 23 January 2026 (Telugu)

## వఖ్ఫె జదీద్ 68వ సంవత్సరంలో జమాఅత్ సభ్యుల ద్వారా చేయబడిన ధన త్యాగాల ప్రస్తావన, 69వ వార్షిక ప్రారంభోత్సవ ప్రకటన

**హజ్రత్ అమీరుల్ మొమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ 23.01.2026 తేదీన – మస్జిద్ ముబారక్ ఇస్లామాబాద్, టిల్‌ఫోర్డ్, (సిర్రె) ఇంగ్లాండ్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశం**

أَشۡهَدُ أَنۡ لَّاۤ إِلٰهَ إِلَّا اللّٰهُ وَحۡدَهٗ لَا شَرِيۡكَ لَهٗ وَأَشۡهَدُ أَنَّ مُحَمَّدًا عَبۡدُهٗ وَرَسُوۡلُهٗ۔ أَمَّا بَعۡدُ فَأَعُوۡذُ بِاللّٰهِ مِنَ الشَّيۡطٰنِ الرَّجِيۡمِ۔
بِسۡمِ اللّٰهِ الرَّحۡمٰنِ الرَّحِيۡمِ ○ اَلۡحَمۡدُ لِلّٰهِ رَبِّ الۡعٰلَمِيۡنَ ○ الرَّحۡمٰنِ الرَّحِيۡمِ ○ مٰلِكِ يَوۡمِ الدِّيۡنِ ○ إِيَّاكَ نَعۡبُدُ وَإِيَّاكَ
نَسۡتَعِيۡنُ ○ اِهۡدِنَا الصِّرَاطَ الۡمُسۡتَقِيۡمَ ○ صِرَاطَ الَّذِيۡنَ اَنۡعَمۡتَ عَلَيۡهِمۡ غَيۡرِ الۡمَغۡضُوۡبِ عَلَيۡهِمۡ وَلَا الضَّآلِّيۡنَ ○

తషహ్హుద్, తఅవ్వుజ్, ఫాతిహా అధ్యాయ పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లు ఉపదేశించారు. హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం జీవిత చరిత్ర గురించి ప్రస్తావన కొనసాగుతోంది. గత ఖుత్బాలలో అల్లాహ్ తఆలా పట్ల వారికున్న ప్రేమ గురించి నేను ప్రస్తావించాను. ఇదే క్రమంలో ఈరోజు మరికొన్ని విషయాలను నేను వివరిస్తాను.

హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఆరాధనా పద్ధతి మరియు దాని సౌందర్యం గురించి ఇదివరకే కొంత వివరించడం జరిగింది. ఈరోజు కూడా అహాదీస్ ఆధారంగా ఇలాగే హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఉన్నత స్థానాన్ని, దైవప్రేమను హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఏ విధంగా చిత్రించారో దానికి సంబంధించిన కొన్ని ఆధారాలను తెలుపుతాను.

హజ్రత్ హుజైఫా రజియల్లాహు అన్హు ఇలా ఉల్లేఖిస్తున్నారు. నేనొక రాత్రి పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంతో కలిసి నమాజు చదివాను. వారు స.అ.స. అల్ బఖరా అధ్యాయంతో ప్రారంభించారు. వారు స.అ.స. 100 సూక్తుల తర్వాత రుకూ చేస్తారని నేను భావించాను, కానీ వారు స.అ.స. ముందుకు కొనసాగారు, ఆ అధ్యాయం పూర్తి కాగానే రుకూ చేస్తారని అనుకున్నాను, కానీ వారు స.అ.స. ఇంకా ముందుకు వెళ్లారు. ఆ తర్వాత వారు స.అ.స. అన్నిసా అధ్యాయం ప్రారంభించి దానిని పఠించారు. అనంతరం ఆలె ఇమ్రాన్ అధ్యాయం ప్రారంభించి దానిని కూడా పఠించారు.

వారు (సల్లం) ఎంతో నిదానంగా, ఆగుతూ పఠించేవారు. ఎక్కడైతే అల్లాహ్ పవిత్రతను (తస్బీహ్) కొనియాడే సూక్తి వచ్చేదో, అక్కడ వారు (సల్లం) తస్బీహ్ చేసేవారు. ఏదైనా దుఆ (ప్రార్థన) కోరే సూక్తి వస్తే, అక్కడ వారు (సల్లం) ప్రార్థించేవారు. అలాగే అల్లాహ్ తఆలా శరణు వేడవలసిన సూక్తి వస్తే, అక్కడ వారు (సల్లం) శరణు కోరేవారు. తరువాత వారు (సల్లం) రుకూ చేశారు, 'సుబ్హాన రబ్బియల్ అజీమ్' (గొప్పవాడైన నా ప్రభువు పరమ పవిత్రుడు) అని పఠించారు. వారి రుకూ వారు (సల్లం) నిలబడిన సమయంతో సమానంగా చాలా సుదీర్ఘంగా ఉంది. ఆపై వారు (సల్లం) 'సమిఅల్లాహు లిమన్ హమిదహ్' (తనను స్తుతించిన వారి మొరను అల్లాహ్ తఆలా విన్నాడు) అని అంటూ తల ఎత్తారు.

రుకూ చేసినంత సమయం వారు (సల్లం) నిటారుగా నిలబడ్డారు. ఆ తర్వాత సజ్దా (సాష్టాంగం) చేస్తూ 'సుబ్హాన రబ్బియల్ ఆలా' (అత్యున్నతుడైన నా ప్రభువు పరమ పవిత్రుడు) అని పఠించారు. వారి (సల్లం) సజ్దా కూడా వారు (సల్లం) నిలబడిన సమయానికి దాదాపు సమానంగా ఉంది.

ఇదేవిధంగా హజ్రత్ ఆయిషా రజియల్లాహు అన్హా ఇలా ఉల్లేఖిస్తున్నారు. ఒక రాత్రి ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం పవిత్ర ఖుర్‌ఆన్‌లోని ఒకే ఒక్క సూక్తిని పఠిస్తూ సుదీర్ఘంగా నమాజులో నిలబడ్డారు. అంతకుముందు అనుచరుడు (హజ్రత్ హుజైఫా) కథనంలో వారు పలు సుదీర్ఘమైన అధ్యాయాలను పఠించినట్లు ఉంది, కానీ ఇక్కడ ఒకే సూక్తిని పఠిస్తూ సుదీర్ఘంగా నిలబడటం గురించి ప్రస్తావించబడింది. హజ్రత్ అబూ జర్ రజియల్లాహు అన్హు కూడా దీనిని ధృవీకరిస్తూ ఇలా తెలిపారు. నబీ సల్లల్లాహు అలైహి వసల్లం ఆరాధన కోసం నిలబడ్డారు. తెల్లవారే వరకు ఒకే సూక్తిని పదేపదే పఠిస్తూ ఉన్నారు. ఆ సూక్తి ఏమిటనగా ఒకవేళ నీవు వారిని శిక్షించినా వారు నీ దాసులే, ఒకవేళ నీవు వారిని క్షమించినా, నిశ్చయంగా నీవు మహా శక్తిమంతుడవు, వివేకమంతుడవు.

హజ్రత్ ఆయిషా రజియల్లాహు అన్హా నుండి మరొక కథనం ఇలా ఉంది. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం కాలంలో ఒకసారి సూర్యగ్రహణం ఏర్పడింది. అప్పుడు దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం నమాజు చేయించారు. వారు స.అ.స. ఎంతో సుదీర్ఘమైన ఖియామ్, రుకూ మరియు సజ్దాలు చేసిన తర్వాత నమాజు పూర్తి చేశారు. అప్పటికి సూర్యుడు ప్రకాశిస్తూ (గ్రహణం వీడి) ఉన్నాడు. అనంతరం వారు స.అ.స. ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. వారు స.అ.స. అల్లాహ్ స్తుతి మరియు స్మరణ చేసిన తర్వాత ఇలా ఉపదేశించారు. సూర్యుడు మరియు చంద్రుడు అల్లాహ్ సూచనలలోని రెండు సూచనలు. ఇవి ఎవరి మరణం వల్ల గానీ లేదా ఎవరి జననం వల్ల గానీ గ్రహణానికి గురికావు. కాబట్టి మీరు వీటిని (గ్రహణాలను) చూసినప్పుడు, అల్లాహ్ గొప్పతనాన్ని చాటండి, అల్లాహ్ తఆలాను ప్రార్థించండి, నమాజు చదవండి మరియు దానధర్మాలు చేయండి. తరువాత వారు స.అ.స. ఇలా అన్నారు. ఓ ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఉమ్మత్ (సమాజ) ప్రజలారా! తన దాసుడు గానీ లేదా తన దాసి గానీ వ్యభిచారానికి పాల్పడితే అల్లాహ్ కంటే ఎక్కువ రోషం మరెవరికీ ఉండదు. ఓ ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఉమ్మత్ (సమాజ) ప్రజలారా! దేవుని సాక్షిగా! నాకు తెలిసిన విషయాలు గనుక మీకు తెలిస్తే, మీరు చాలా తక్కువగా నవ్వుతారు మరియు ఎక్కువగా ఏడుస్తారు. ఆ తర్వాత వారు స.అ.స. 'వినండి! నేను (సందేశాన్ని) చేరవేశానా?' అని ప్రశ్నించారు.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. ఈ విధంగా హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం దైవం వైపునకు మళ్ళడం, అతన్ని ఆరాధించడం, అతని ముందు వినమ్రంగా తలవంచడంపై అందరి దృష్టిని మళ్లించారు. మరియు దీనిలోనే మీ మనుగడ ఉంది, దీనిలోనే మీ జీవితం ఉంది అని నొక్కి చెప్పారు. నాకు తెలిసినట్లుగా ఒకవేళ మీకు ఈ విషయాల లోతు తెలిసుంటే, మీరు నవ్వడం మానేసి ఎక్కువగా ఏడ్చేవారు మరియు అల్లాహ్ తఆలాను ప్రార్థించేవారు అని సూచించారు. కాబట్టి మనం కూడా

ప్రార్థనల వైపు ఎంతో శ్రద్ధ వహించాలని మరియు అల్లాహ్ తఆలాతో ఒక ప్రత్యేకమైన సంబంధాన్ని ఏర్పరచుకోవాలని ఆయన స.అ.స హితవు పలికారు.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. ఇదేవిధంగా హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం దైవాజ్ఞ లేకుండా ఏ పెద్ద పనిని కూడా చేసేవారు కాదు. అల్లాహ్ తఆలా ఆదేశం వచ్చినప్పుడే చేసేవారు. మక్కా వాసులు తీవ్రమైన హింసలకు గురిచేస్తున్నప్పటికీ అల్లాహ్ తఆలా నుండి దైవవాణి ద్వారా మక్కాను వీడమని ఆజ్ఞ వచ్చే వరకు వారు స.అ.స. మక్కాను వదలలేదు. మక్కా వాసుల అకృత్యాల తీవ్రతను చూసి అనుచరులు ఎబిసీనియా వైపు వలస వెళ్ళడానికి ప్రవక్త స.అ.స. అనుమతి ఇచ్చారు. వారు (అనుచరులు) ప్రవక్త స.అ.స. కూడా తమతో రావాలని కోరగా, వారు ఇలా సమాధానం ఇచ్చారు. నాకు ఇంకా దైవం నుండి అనుమతి లభించలేదు.

దైవప్రేమకు సంబంధించి, ప్రవక్త స.అ.స. తాయిఫ్ ప్రయాణంలో గాయపడిన సంఘటన చరిత్రలో ప్రసిద్ధి చెందింది. ప్రవక్త పదవి లభించిన 10వ సంవత్సరంలో అబూ తాలిబ్ మరణానంతరం, ఖురైషీలు మరల హింసలు ప్రారంభించినప్పుడు ప్రవక్త స.అ.స. తాయిఫ్ వెళ్లారు. వారు స.అ.స. అక్కడ పది రోజుల పాటు ఉండి ఇస్లాం ధర్మాన్ని బోధించారు, కానీ ఎవరూ వారి స.అ.స. ఆహ్వానాన్ని స్వీకరించ లేదు. సహీ బుఖారీలో ఈ సంఘటన గురించి ఇలా ఉంది. హజ్రత్ ఆయిషా (రజి) ప్రవక్త గారిని మీకు ఉహుద్ యుద్ధం కంటే కష్టతరమైన రోజు ఏదైనా ఎదురైందా? అని అడిగారు. దానికి వారు స.అ.స. ఇలా అన్నారు. అఖబా రోజున (తాయిఫ్‌లో) ఆ ప్రజల నుండి ఎదురైన కష్టం అంతకంటే కఠినమైనది. నేను నా సందేశాన్ని 'ఇబ్నె అబీ అబ్ద యాలైల్ బిన్ అబ్ద కులాల్' ముందు ఉంచినప్పుడు, నేను ఆశించిన విధంగా అతను స్పందించలేదు. దాంతో నేను ఎంతో ఆవేదనతో, దిగులుగా అక్కడి నుండి తిరిగి వచ్చాను. నేను 'ఖర్నుస్సఆలిబ్' చేరుకున్నాక నా దిగులు కొంచెం తగ్గింది. అప్పుడు తల ఎత్తి చూడగా ఒక మేఘం నాకు నీడ నిచ్చి ఉంది. అందులో జిబ్రయీల్ అలైహిస్సలాం ఉన్నారు. ఆయన నన్ను పిలిచి మీ జాతి వారు మీకు చెప్పిన మాటలను అల్లాహ్ విన్నాడు. వారి విషయంలో మీరు ఏమి కోరుకుంటే అది చేయడానికి అల్లాహ్ మీ వద్దకు పర్వతాల దేవతను పంపాడని చెప్పారు.

మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇంకా ఇలా ఉపదేశించారు. అప్పుడు ఆ పర్వతాల దేవత నన్ను పిలిచి సలాం చేసి ఇలా అన్నాడు. ఓ ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం)! మీరు కోరుకుంటే ఆజ్ఞాపించండి, ఈ రెండు కొండలను వారిపై కలిపేసి వారిని నలిపేస్తాను! దానికి పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా సమాధానమిచ్చారు. వద్దు! అల్లాహ్ వీరి సంతానం నుండి కేవలం ఒక్క అల్లాహ్‌ను మాత్రమే ఆరాధించే, అతనికి ఎవరినీ సాటికల్పని ప్రజలను పుట్టిస్తాడని నేను ఆశిస్తున్నాను. హుజూరె అన్వర్ ఇలా వివరించారు. ఇక్కడ కూడా మహా ప్రవక్త (సల్లం) సానుభూతి, కరుణే పైచేయి సాధించాయి. వారు (సల్లం) ఆ జాతిని వినాశనం నుండి కాపాడారు. తర్వాతి కాలంలో మక్కా విజయం తర్వాత, వారి సంతానం ఇస్లాం ధర్మాన్ని స్వీకరించింది.

హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఉన్నత స్థానాన్ని, హోదాను వివరిస్తూ హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇలా ప్రవచించారు. మహోజ్వలమైన కాంతి మానవునికి ప్రసాదించ బడినా మానవులందరిలో సర్వశ్రేష్టుడైన ముహమ్మద్‌కే ఆ కాంతి విశేషంగా అనుగ్రహింపబడింది. ఆ కాంతిని దేవదూతలు పంచుకోలేరు. నక్షత్రాలు పంచుకోలేవు. చంద్రునిలోను ఆ కాంతి లేదు. సూర్యుని లోనూ లేదు, సముద్రాలలోనూ లేదు, నదులలోను లేదు, పద్మరాగాల్లో లేదు. నవకతాల్లో లేదు. ఇంద్రనీలాల్లో లేదు. మౌక్తికాల్లో లేదు. ఆకాశంలో, వేదభూమిలో వున్న పదార్థంలోనూ లేదు. అది సమగ్ర మానవునిలోనే వుంది. సమగ్రమైన రూపంలో వున్న ఆ మహా వ్యక్తిలో వుంది. ఆయన మన గురువు, మన యజమాని ముహమ్మద్. దేవునికి ప్రీతి పాత్రుడు. ప్రవక్తలందరిలో ప్రముఖుడు. అల్లాహ్ దృష్టిలో వున్నవాళ్ళందరికి నాయకుడు. అందుకే ఆ మహా కాంతి అతనికి ప్రసాదించబడినది. అదే విధంగా కొంత వరకు అతనితో పోలిన వారికి ఆ దట్టమైన కాంతి లభించినది.

హుజూరె అన్వర్ ఈ విషయంలో హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారి మరికొన్ని జ్ఞానోదయమైన ప్రవచనాలను ప్రస్తావించిన తర్వాత ఇట్లనిరి. హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఉన్నత స్థానం, హోదా గురించి అల్లాహ్ తఆలా హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ)నకు ప్రసాదించిన అత్యున్నత స్థాయి అవగాహన, జ్ఞానమిది. దీనినే వారు (అ) మనకు కూడా వివరించిరి. ఇంత స్పష్టంగా ఉన్నప్పటికీ, మా విరోధులు మాత్రం (నఊజుబిల్లాహ్) మేము మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంను అవమానిస్తున్నామని, హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ)నకు అంతకంటే ఎక్కువ స్థానం ఇస్తున్నామని మాపై నిందలు మోపుతున్నారు. అల్లాహ్ తఆలా ప్రతి అహ్మదీని వారి కీడు నుండి రక్షించుగాక. హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) రచనల వెలుగులో హుజూరె అన్వర్ హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం చీకటి రాత్రులలో చేసిన ఆమోదిత ప్రార్థనల ప్రభావాన్ని వివరిస్తూ ఇలా ప్రవచించిరి. ప్రార్థనల ప్రభావం నీరు, నిప్పుల ప్రభావం కంటే అధికంగా ఉంటుందని నేను నా వ్యక్తిగత అనుభవం ద్వారా చూస్తున్నాను. నిజానికి భౌతిక కారణాల శ్రేణిలో ప్రార్థన అంతటి గొప్ప ప్రభావం కలిగినది మరేదీ లేదు.

ముగింపులో హుజూరె అన్వర్ ఈ విషయంలో ఇలా ప్రార్థించిరి. అల్లాహ్ తఆలా మనల్ని ఈ మార్గంలో నడిపిస్తూ, ఆమోదిత ప్రార్థనలు చేసే భాగ్యాన్ని ప్రసాదించుగాక. యథార్థ రీతిలో ప్రార్థించే శక్తిని ప్రసాదించుగాక. ప్రార్థనల హక్కును నెరవేరుస్తూ, హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఆదర్శ జీవితాన్ని అనుసరించడానికి ప్రయత్నించే నిజమైన ముస్లింలుగా మనల్ని తీర్చిదిద్దుగాక!

اَلْحَمْدُ لِلّٰهِ نَحْمَدُهٗ وَنَسْتَعِيْنُهٗ وَنَسْتَغْفِرُهٗ وَنُؤْمِنُ بِهٖ وَنَتَوَكَّلُ عَلَيْهِ۔ وَنَعُوْذُ بِاللّٰهِ مِنْ شُرُوْرِ اَنْفُسِنَا وَمِنْ سَيِّئَاتِ اَعْمَالِنَا۔ مَنْ يَّهْدِهِ اللّٰهُ فَلَا مُضِلَّ لَهٗ وَمَنْ يُّضْلِلْهُ فَلَا هَادِيَ لَهٗ۔ وَنَشْهَدُ اَنْ لَّآ اِلٰهَ اِلَّا اللّٰهُ وَنَشْهَدُ اَنَّ مُحَمَّدًا عَبْدُهٗ وَرَسُوْلُهٗ۔ عِبَادَ اللّٰهِ رَحِمَكُمُ اللّٰه! اِنَّ اللّٰهَ يَأْمُرُ بِالْعَدْلِ وَالْاِحْسَانِ وَاِيْتَآءِ ذِي الْقُرْبٰى وَيَنْهٰى عَنِ الْفَحْشَآءِ وَالْمُنْكَرِ وَالْبَغْيِ۔ يَعِظُكُمْ لَعَلَّكُمْ تَذَكَّرُوْنَ۔ اُذْكُرُوا اللّٰهَ يَذْكُرْكُمْ وَادْعُوْهُ يَسْتَجِبْ لَكُمْ وَلَذِكْرُ اللّٰهِ اَكْبَرُ۔